


# ఏడుగురు అన్నలకు ఒకే చెల్లెలు

ఒక అడవిలో ఒక చెల్లెలు. ఆ చెల్లెలికి ఏడుగురు అన్నలు. వాళ్లందరూ ఒక పెద్ద భవంతిలో సంతోషంగా కాలం గడిపేవాళ్లు. వాళ్లింట్లో వాళ్లతోపాటు ఒక కుక్క వుండేది. ఒక పిల్లి వుండేది. వాళ్ల గుమ్మం ముందు కాపలాకు ఒక గంధం చెట్టు వుండేది.

ఈ ఏడుగురు అన్నలు ఏడాదిలో ఆరు నెలలపాటు వర్తకానికి దేశాల మీదకి వెళ్లేవాళ్లు. వాళ్లు వెళ్లాక చెల్లెలు తలుపు తీయడానికి వీల్లేదు. ఆరు నెలల తర్వాత అన్నలు వచ్చాకనే తలుపు తెరవాలి. అప్పుడు కూడా వచ్చింది అన్నలే అని పోల్చుకొని మరీ తలుపు తీయాలి.

ఆ పోలిక ఎట్లా తెలుస్తుంది? వాళ్లు ఒక పాట పాడతారు. ఏమని?

**నీ ఏడుగురు అన్నలు వచ్చారూ వచ్చారూ**

**నీకు పండ్లూ పూలు తెచ్చారూ తెచ్చారూ**

**తలుపు తీయవే చెల్లెలా...** అని.

అప్పటికీ తలుపు తీయడానికి వీల్లేదు. ఏమో. ఆ పాట పాడుతున్నది అన్నలు కాదేమో. అప్పుడు గుమ్మం ముందున్న గంధం చెట్టు కూడా పాడుతుంది.

**నీ ఏడుగురు అన్నలూ వచ్చారూ వచ్చారూ**

**నీకు పండ్లూ పూలు తెచ్చారూ తెచ్చారూ**

**తలుపు తీయవే చెల్లెలా....**

అట్లా గంధం చెట్టు కూడా పాడాకనే చెల్లెలు తలుపు తెరుస్తుంది. యిట్లాగే ఏళ్లు గడుస్తున్నాయి. ఆ ఏడాది కూడా అన్నలు వర్తకానికి దేశాల మీదకు వెళ్లే వేళయింది.

వాళ్లు వెళుతూ వెళుతూ చెల్లెల్ని పిలిచి 'అమ్మా. పొయ్యిలో నిప్పు ఆరిపోకూడదు. లాంతరులో దీపం మలిగిపోకూడదు. కుక్కకు పాలకూడు పెట్టకూడదు. పిల్లికి నెయ్యి కూడు పెట్టకూడదు. మేము వచ్చేంతవరకు నువ్వు తలుపు తీయకూడదు' అని జాగ్రత్తలు చెప్పి, గంధం చెట్టుని కాపలాకు వుంచి వెళ్లిపోయారు.

ఆ మరుసటిరోజే చెల్లెలు ఏదో ఏమరుపాటులో పిల్లికి నెయ్యికూడు, కుక్కకు పాలకూడు పెట్టేసింది. అవి వాటిని తినకుండా అలిగెళ్లి పడుకున్నాయి. ఆ కోపంతో ఒంటేలు పోసి పొయ్యి ఆర్పేసింది పిల్లి. కిందకు దొర్లించి లాంతరును ఆర్పేసింది కుక్క. యిల్లంతా చీకటి.

ఆ చీకటిలో చెల్లెలు ఏడ్చుకొని, కాసేపటికి ధైర్యం తెచ్చుకొని, బయటెక్కడైనా వెతికితే నిప్పు దొరక్కపోదా అని తలుపు తెరుచుకొని బయటకు వచ్చింది.

వచ్చి, నిప్పు కోసం వెతకడం మొదలుపెట్టింది. అడవిలో పోంగా పోంగా దూరంగా ఒకచోట ఒక గుడిసె కనిపించింది. అందులో ఒక ముసల్ది వంట చేసుకుంటా వుంది. అది సైతాన్. ఆ సంగతి చెల్లెలికి తెలియదు.

అందువల్ల ధైర్యంగా లోపలికి వెళ్లి 'అవా అవా. కొంచెం నిప్పుంటే పెట్టవా' అని అడిగింది.

చెల్లెల్ని చూసి ముసల్ది లోలోపల లొట్టలు వేసింది. పైకి మాత్రం ప్రేమగా ముఖంపెట్టి 'యిస్తాగానీ మనవరాలా! కాసేపు నా తల్లో పేలు చూడవా' అని అడిగింది.

ఆమె పథకం ఏమిరా అంటే ఆమె కొడుకులు వేటకు వెళ్లున్నారుగదా వాళ్ల తిరిగి వచ్చేదాకా చెల్లెల్ని ఆపగలిగితే వాళ్లొచ్చి పట్టుకుంటారులే అని. కానీ చెల్లెలు ఆగకుండా 'కుదర్దవా. త్వరగా వెళ్లాలి. యిస్తే యివ్వు లేకపోతే లేదు' అంది.

'అయ్యో అదేంమాటే మనవరాలా' అని ఒక ముంతలో నిప్పు పోసిచ్చి, ఒక సంచిలో బూడిద నింపి, దానికి చిల్లిపెట్టి 'చూడమ్మా. దీన్ని బొడ్లో దోపుకొని వెళ్ల మంచిది' అని చెప్పింది ముసల్ది.

అలాగే అని బయల్దేరింది చెల్లెలు.

దారంతా సంచిలో నుంచి బూడిద కారి ఆనవాలు నిలిచింది. కాసేపటికి ముసల్దాని కొడుకులు వచ్చారు.

'ఒరే బుద్ధిలేని యదవల్లారా. యిప్పుడా వచ్చేది. మంచి లేతమాంసం తప్పిపాయెనే. అయినా పథకం వేశాను. ఆ పిల్ల ఎక్కడికి వెళ్లంటుందో అక్కడిదాకా బూడిద కారి ఆనవాలు నిలుచుని వుంటుంది. వెళ్లండి. వెళ్లి దాన్ని పట్టుకొని రండి' అని చెప్పి పంపించింది.

బూడిద దోవను పట్టుకొని ముసల్దాని కొడుకులు వచ్చారు. దబాదబా తలుపులు తట్టారు. తెరుచుకుంటేగదా. పాట పాడనిదే తలుపులు తెరుచుకోవని వాళ్లకు తెలియదు. ఎలాగైనా సరే లోపలున్న చెల్లెల్ని పట్టుకోవాలి అని బయటే ఆరునెలలపాటు మకాం వేశారు.

ఆరు నెలలు గడిచాయి. వర్తకానికి వెళ్లిన ఏడుగురు అన్నలు తిరిగి వచ్చారు. వచ్చి -

'నీ ఏడుగురు అన్నలు వచ్చారూ వచ్చారూ
నీకు పండ్లూ పూలూ తెచ్చారూ తెచ్చారూ
తలుపు తీయవే చెల్లెలా"... అని పాడారు.

గంధం చెట్టు కూడా పాడింది. తలుపు తెరుచుకుంది. దూరాన వున్న ముసల్దాని కొడుకులకి అన్నలు పాడటమే వినిపించిందిగానీ గంధం చెట్టు పాడటం వినపడలేదు.

ఓహో యిదా సంగతి అనుకున్నారు వాళ్లు. మళ్లీ ఆరునెలలు మకాం వేశారు. ఏడుగురు అన్నదమ్ములు వర్తకానికి వెళ్లాక యింక దొరికిందిరా యిది అనుకొని గబగబా వచ్చి తలుపు తట్టారు. తట్టి -

'నీ ఏడుగురు అన్నలు వచ్చారూ వచ్చారూ
నీకు పండ్లూ పూలూ తెచ్చారూ తెచ్చారూ
తలుపు తీయవే చెల్లెలా'... అని పాడారు.

కానీ గంధం చెట్టు కూడా పాడాలి గదా. అది మాత్రం -

'నీ ఏడుగురు అన్నలు రాలేదూ రాలేదూ
నీకు పండ్లూ పూలూ తేలేదూ తేలేదూ
తలుపు తీయకే చెల్లెలా' అని పాడింది.

ముసల్దాని కొడుకులు అది చూసి బిత్తరపోయారు. చెట్టేంది పాడటం ఏంది దీనిని నరికిపారేద్దాం అనుకొని నరికిపారేశారు. నరికినా దాంట్లో నుంచి మళ్లీ పాట వచ్చింది.

'నీ ఏడుగురు అన్నలు రాలేదూ రాలేదూ
నీకు పండ్లూ పూలు తేలేదూ తేలేదూ

తలుపు తీయకే చెల్లెలా'...

ముసల్దాని కొడుకులకి యింకా కోపం వచ్చింది. దీనిని తగులబెడదాం అప్పుడుగానీ పీడా విరగడ కాదు అనుకొని నరికేసిన చెట్టు మీద నూనెబోసి తగులబెట్టేశారు. తగులబెట్టాక మిగిలిన బూడిదలో నుంచి మళ్లా పాట వచ్చింది.

'నీ ఏడుగురు అన్నలు రాలేదూ రాలేదూ

నీకు పండ్లూ పూలు తేలేదూ తేలేదూ

తలుపు తీయకే చెల్లెలా'...

యింక యిలా కాదని చెప్పి ఆ బూడిదను తీసుకెళ్లి సముద్రంలో కలిపారు ముసల్దాని కొడుకులు. సముద్రంలో నుంచి కూడా పాట వచ్చింది.

'నీ ఏడుగురు అన్నలు రాలేదూ రాలేదూ

నీకు పండ్లూ పూలు తేలేదూ తేలేదూ

తలుపు తీయకే చెల్లెలా'...

సముద్రాన్ని ఏం చేయాలో తెలియక, ప్రాప్తం లేదనుకొని వెనక్కుమళ్లారు ముసల్దాని కొడుకులు. కోపం వచ్చిన ఒక కొడుకు మాత్రం పోతూపోతూ వాడి దవడలోని ఒక పన్ను పీకి గడప దగ్గర పాతిపెట్టి వెళ్లిపోయాడు.

ఆరు నెలలు గడిచాయి. అన్నలు వచ్చారు. పాట పాడారు. సముద్రంలో నుంచి గంధం చెట్టు కూడా పాట పాడింది. చెల్లెలు తలుపు తీసీ తీయగానే గడపలోని పన్ను ఆమె పాదంలో గుచ్చుకొని అలాగే పడిపోయింది. మళ్లీ లేవలేదు. చెల్లెలు అట్లా పడిపోవడం, గంధం చెట్టు లేకపోవడం యిదంతా చూసిన అన్నలు ఏదో దుష్టశక్తి దాపురించి చెల్లెల్ని చంపేసిందని అనుకున్నారు. ఆమెను చేతులారా పాతిపెట్టడానికి మనసొప్పక, ఆస్తినీ పాస్తినీ, ధనాన్నీ సంపదనీ అలాగే వదిలేసి మతిపోయినవాళ్లలాగా ఏడుస్తూ దేశం పట్టి వెళ్లిపోయారు.

కొన్నాళ్లకు అటుగా ఒక రాజకుమారుడు వేటకు వచ్చాడు. ఈ అడవిలో యింత మంచి భవంతి ఉందేమిటి అనుకొని, ఆగి, లోపలికి వెళ్లి చూశాడు.

లోపల, చెక్కుచెదరని సౌందర్యంతో చెల్లెలు పడుకొని వుంది. ఆమెను చూసేసరికి రాకుమారుడు యింకా ఆశ్చర్యపోయాడు. ఏమి ఈ మాయ, ఎందుకు ఈమె యిలా పడుకొని వుంది అని పరీక్షించాడు.

ఆమె పాదంలో గుచ్చుకుని వున్న పన్ను కనిపించింది. అయ్యయ్యో పన్ను గుచ్చుకున్నట్టుందే అనుకొని దానిని పీకేశాడు.

అంతే, నిద్ర లేచినట్టుగా లేచి కూర్చుంది చెల్లెలు. ఎదురుగా వున్న రాకుమారుణ్ణి చూసి సిగ్గుపడింది. నా అన్నలేరి అని ప్రస్తావించింది. రాకుమారుడు ఆమె సంగతి అంతా విని, ఆమెను తీసుకొని రాజ్యానికి వెళ్లాడు. ఆ తర్వాత అన్నలను వెతికించాడు. వాళ్లు కనిపించాక, వాళ్ల అనుమతితో వాళ్ల చెల్లెల్ని పెళ్లి చేసుకున్నాడు.

ఆ తర్వాత వాళ్లందరూ హాయిగా కాలం గడిపారు.

✪ ఈ కతలో పాట ముఖ్యం. మా పెదమ్మ కరిమున్ పాటను ఇలా పాడింది:

'తెరె సాతో భాయా ఆయెమా ఆయె

తుజె ఫుడా గుడా లాయెమా లాయె

దర్వాజా ఖోల్'